

19న ఐఎబి సమావేశం

హెచ్ఎల్సీ ఎస్ఈ రాజశేఖర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఐఎబి ఛైర్‌పర్సన్, కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశాల మేరకు ఈనెల 19వ తేదీన ఐఎబి సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఐఎబి కన్వీనర్, హెచ్ఎల్సీ రాజశేఖర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అనంతపురం కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఈనెల 19వ తేదీన ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ సమావేశంలో పాల్గొనాలని కోరారు. ఈ నెల 12వ తేదీ జరగాల్సిన ఈ సమావేశం అనివార్య కారాణాల వల్ల వాయిదా పడింది. దీంతో సమావేశాన్ని 19వ తేదీ నిర్వహించేలా అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఐఎబి సమవేశం జరిగి తే నీటి కేటాయింపులు జరుగుతాయనే ఆశతో ప్రజలు ఉన్నారు.



జెవివి వార్షిక మహాసభల సందర్భంగా ప్రసంగిస్తున్న ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్

సైన్స్ సంబరం

సైన్స్ గొప్పతనాన్ని తెలియజేశారు...
మూఢనమ్మకాల వల్ల కలిగే ప్రమాదాన్ని వివరించారు...
సమాజంలో ఉన్నదంతా సైన్స్ అని చాటిచెప్పారు....
అశాస్త్రీయ విధానాలను ప్రజలపై రుద్దే పాలకుల విధానాలను ఎండగట్టారు...
మానవాభివృద్ధికి మూలం సైన్స్ అనే విషయాన్ని ఎలుగెత్తి చాటారు...
అవాస్తవిక విధానాలకు అంతం పలికి, చైతన్యం వైపు ప్రజలు నడిచేలా జాగృతం చేశారు...

అనంతపురం నగరంలోని జిఆర్.ఫంక్షన్ హాలులో శనివారం ప్రారంభం అయిన జెవివి 17వ వార్షిక మహాసభల్లో వక్తల ప్రసంగాలు ఆద్యంతం ప్రజలను ఆలోచింపజేశాయి. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు ప్రసంగించారు. సైన్స్ గొప్పతనాన్ని తెలియజేస్తూ వారు చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. మూఢనమ్మకాలను పారదోలేలా ప్రజలను చైతన్య వంతం చేసేలా ప్రసంగించారు. వాస్తవికతను తెలియజేస్తూ, మూఢనమ్మకాలను వ్యతిరేకిస్తూ పాలకుల అశాస్త్రీయ విధానాలను ఎండగడుతూ చైతన్యవంతమైన ప్రసంగాలు సాగాయి.



నోటిలో దీపాన్ని వెలిగించే మ్యాజిక్ షోను చేస్తున్న యువకుడు



పిల్లా కుమారస్వామి రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జెవివి, ఇతర సంఘాల నాయకులు

- సైన్స్‌తోనే మానవ మనుగడ
- సమాజంలో ఉన్నదంతా సైన్సే..!
- మూఢవిశ్వాసాలతో నష్టం
- అశాస్త్రీయ విధానాలను జనంపై రుద్దేలా పాలకుల విధానాలు
- సైన్స్ గొప్పదనం.. మూఢనమ్మకాల ప్రమాదాన్ని వివరించేలా ప్రసంగాలు
- సంబరంగా 'అనంత'లో ప్రారంభమైన జెవివి వార్షిక మహాసభ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించేందుకు కృషి చేసే జన విజ్ఞాన వేదిక వార్షిక రాష్ట్ర మహాసభ సంబరంగా ప్రారంభమైంది. రాష్ట్రం నలుమూలల నుంచి జన విజ్ఞాన వేదిక నాయకులు, కార్యకర్తలు అనంతపురం తరలొచ్చారు. నగరంలోని జిఆర్ ఫంక్షన్ హాలులో శనివారం ఉదయం సభలు ప్రారంభమయ్యాయి. సమతా కన్వీనర్ డాక్టర్ ప్రసూన జాతీయ పతాకావిష్కరణ చేయగా, జనన విజ్ఞాన వేదిక నాయకులు డాక్టర్ రంగన్న జన విజ్ఞాన వేదిక పతాకాన్ని ఆవిష్కరించారు. జన విజ్ఞాన వేదికలో పనిచేస్తూ మరణించిన సీనియర్ నాయకులకు నివాళులు అర్పించారు. అనంతరం జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ అధ్యక్షతన మహాసభ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ (ఎఐపిఎస్ఎన్) మాజీ అధ్యక్షులు ప్రొఫెసర్ సవ్యసాచి చటర్జీ పాల్గొని ప్రారంభోపన్యాసం చేశారు. అంతకు మునుపు మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం మహాసభను ఉద్దేశించి సందేశమిచ్చారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, ఉపాధ్యక్షులు భాస్కర్, జన విజ్ఞాన వేదిక నాయకులు డాక్టర్ హేమలత, సమతా కన్వీనర్ డాక్టర్ ప్రసూన, జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మినారాయణ, సత్యసాయి జిల్లా కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు, మెడికల్ రెప్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు మనోహర్, కవి, రచయిత కంబదూరు షేక్ నబీరసూల్ తదితరులు పాల్గొన్నారు.

అశాస్త్రీయ ఆలోచనలతో పాలన

ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి



దేశంలో ఇప్పుడు అశాస్త్రీయ ఆలోచనలున్న వారు అధికార పీఠమెక్కి పాలన సాగిస్తున్నారని కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత ఆచార్య రాజపాలెం చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. శాస్త్రీయ ఆలోచనల వ్యాప్తిలో ఇప్పుడున్న అవరోధాల కంటే రాబోయే రోజుల్లో మరింత ఎక్కువగా ఉంటాయన్న విషయాన్ని సైన్స్ ప్రచారకులు గుర్తు పెట్టుకోవాలని సూచించారు. అందరిలోకి శాస్త్రీయ ఆలోచనలను తీసుకెళ్లేందుకు మరింతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

మూఢనమ్మకాల నిరోధక చట్టం చేయాలి

మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి



శాస్త్ర విజ్ఞానం పెరిగిన ఈ సమయం లోనూ అశాస్త్రీయ ఆలోచనలు కొనసాగుతూనే ఉండటం శోచనీయమని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తెలియజేశారు. విద్యావంతులు కూడా వీటిని ఆచరించే పరిస్థితులు ఉన్నాయన్నారు. దీన్ని రూపుమాపేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వాలు కూడా మూఢనమ్మకాల నిరోధక చట్టం చేయాలని కోరారు.

విద్య, వైద్యంలో ప్రచారం అవసరం

సామాజిక కార్యకర్త బోస్



విద్యా, వైద్యంలో శాస్త్రీయతను పెంపొందించేందుకు కృషి చేయాలని సామాజిక కార్యకర్త బోస్ పిలుపునిచ్చారు. నూతన విద్యా విధానం పేరుతో అశాస్త్రీయతను ప్రవేశపెడుతున్నారన్నారు. దీన్ని తిప్పికొట్టే ఆలోచనలు చేయాలన్నారు. వైద్యరంగంలోనూ కొన్ని మార్పులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.

శాస్త్రీయ దృక్పథం పెంచాలి

సవ్యసాచి చటర్జీ




సైంటిఫిక్ టెంపర్ -ఛాలెంజెస్ 'అన్న అంశంపై ప్రొఫెసర్ సవ్యసాచి చటర్జీ ప్రారంభోపన్యాసం చేశారు. దేశంలో గూడుకట్టుకున్న అశాస్త్రీయ భావాలకు వ్యతిరేకంగా 1882 నుంచే రాజ రామ్మోహన్ రాయ్ వంటి వారు పనిచేసారని గుర్తు చేశారు. తరువాత స్వాతంత్రోద్యమ కాలంలోనూ శాస్త్రీయతపై మరింతగా దృష్టి సారించారన్నారు. ఈ స్ఫూర్తితోనే స్వాతంత్ర్యం అనంతరం కూడా శాస్త్రీయ దృక్పథం ప్రజల్లో పెంపొందించాలని రాజ్యాంగంలో పొందుపరుచుకున్నట్లు తెలిపారు. ఇటీవలి కాలంలో తిరోగామి శక్తులు ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంపుదలకు వ్యతిరేకంగా పనిచేస్తుండడం విచారం కలిగించే అంశం అన్నారు. ఈ అవరోధాన్ని అధిగమించే దిశగా సైన్సు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాల్సి ఉంటుందని పిలుపునిచ్చారు.



జెవివి వార్షిక మహాసభలకు హాజరైన ప్రతినిధులు

సైన్స్, టెక్నాలజీ ఒక్కటి కాదు

మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్



ప్రస్తుత సమాజంలో సైన్స్, టెక్నాలజీ ఒక్కటే అన్న అపోహ ఉందని మానవహక్కుల వేదిక రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్ తెలిపారు. సైన్స్ వేరు టెక్నాలజీ వేరని సూచించారు. సైన్స్ పెంపుదలపై ప్రస్తుతం తగినంత ప్రోత్సహం ఉండటం లేదని చెప్పారు. దీన్ని పెంపొందించడంలో కీలకంగా వ్యవహరించే విశ్వవిద్యాల యాల్లోనే పరిశోధనలు జరగకపోవడం శోచనీయమన్నారు.

కియా రాకతో మారిన పెనుకొండ రూపురేఖలు

బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

కియా కార్ల కంపెనీ రాకతో పెనుకొండ ప్రాంతం ఆర్థిక పురోభివృద్ధి గణనీయంగా పెరిగిందని బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. కియా సిఎస్ఆర్ పథకం కింద మండలంలోని దుద్దేబండ గ్రామంలో మంజూరు చేసిన నూతన అంగనవాడీ భవనానికి శనివారం మంత్రి భూమిపూజ చేశారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సామూహిక సీమంతం కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ చంద్రబాబు కృషితో కియా ఈ ప్రాంతానికి రావడంతో వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించిందన్నారు. భూముల ధరలు అమాంతం పెరిగాయన్నారు. కియా పరిశ్రమ కోసం భూములు ఇచ్చిన రైతులు, ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో కియా ప్రతినిధులతో చర్చించి సిఎస్ఆర్ నిధులతో పెనుకొండ నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నా మన్నారు. ప్రస్తుతం మండలంలో 3 అంగన్వాడీ కేంద్రాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేశారన్నారు. రాష్ట్రంలోనే మోడల్ అంగన్వాడీ కేంద్రంగా నిర్మాణం చేస్తున్నారని తెలిపారు. రైతుల అభివృద్ధి కోసం పండ్ల మొక్కలు పంపిణీ చేశారన్నారు.



గొల్లపల్లి రిజర్వాయర్‌లో గంగపూజ చేస్తున్న మంత్రి సవిత

సీసీ రోడ్డు పనుల పరిశీలన

గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి గొల్లపల్లి గ్రామం వరకూ రూ. 1.6 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను మంత్రి పరిశీలించారు. గడువు లోపు రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని, నాణ్యతలో రాజీ పడే ప్రసక్తే లేదని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం జీడిపల్లి రిజర్వాయర్ నుంచి గొల్లపల్లి రిజర్వా యర్‌కు వస్తున్న నీటిని పరిశీలించి మంత్రి జల హారతి ఇచ్చారు. మంత్రి వెంట సిడిపిఒ శాంతలక్ష్మి, మాజీ జడ్పిటిసిలు నారాయణస్వామి, మునిమడుగు వెంకటరాముడు, శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ కేశవయ్య, టిడిపి మండల కన్వీనర్ సిద్దయ్య, పెనుకొండ పట్టణ పార్టీ కన్వీనర్ శ్రీరాములు యాదవ్, నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, రామకృష్ణ, పోతిరెడ్డి, శ్రీనివాసులు, త్రివేంద్ర, రఘువీరాచౌదరి, రామలింగ, షౌకత్, సోము, బాబుల్‌రెడ్డి, కార్యకర్తలు, అధికారులు ఉన్నారు.

రాజీ కేసులకు లోక్ అదాలత్ చక్కటి పరిష్కార వేదిక

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

రాజీ కాదగ్గ కేసులకు లోక్ అదాలత్ చక్కటి పరిష్కారం చూపుతుందని పుట్టపర్తి జూనియర్ సివిల్ జడ్జి కె.రాకేష్ పిలుపునిచ్చారు. పుట్టపర్తి కోర్టులో శనివారం జూనియర్ సివిల్ జడ్జి అధ్యక్షతన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో వివిధ కేసులు మొత్తం 76 కేసులను పరిష్కరించారు. జడ్జి కె.రాకేష్ మాట్లాడుతూ చిన్న తగాదాలు, మనస్పర్ధల కారణంగా పట్టింపులకు పోయి కేసులు నమోదు చేసుకొని ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగి నష్టపోకుండా కక్షిదారుల మధ్య రాజీ కుదర్చడం ద్వారా కేసులకు పరిష్కారం చూపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి బార్ అసోసియే షన్ అధ్యక్షులు కత్తి గంగిరెడ్డి, న్యాయవాదులు నిడిమామిడి శ్రీనివాసులు, లెక్కల యదుభూషన్, ఇందిర, చల్లా చంద్రశేఖర్, మౌనిక, రాజగోపాల్, క్రిమినల్ క్లర్క్ మంజునాథ్, ఎంఎల్‌టిసి లక్ష్మేనాయక్, సివిల్ క్లర్క్ అశ్వర్థనారాయణ పాల్గొన్నారు.

కదిరి లోక్ అదాలత్‌లో 62 కేసులు పరిష్కారం

కదిరి అర్బన్ : స్థానిక కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించగా మండల న్యాయ సేవ అధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి హాజరయ్యారు. రాజీ కాదగిన క్రిమినల్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు మొత్తం 62 కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. శనివారం రెండు బెంచీలు ఏర్పాటుచేశారు. మొదటి బెంచిలో సీనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి శ్రీనివాసులు, ప్రభాకర్‌రెడ్డి, 2వ బెంచిలో నసూజిన్ కుమార్, మొబైల్ కోర్టు మెంబర్లు జాఫర్‌ఖాన్, దశరథనాయక్. హాజరయ్యారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నాగేంద్రరెడ్డి, సుబ్బరాజుగుప్తా, నరసింహులు, లోకేశ్వర్‌రెడ్డి, రవీంద్రబాబు, పాల్గొన్నారు.



హిందూపురంలో కక్షి దారులకు రాజీ ప్రతులను అందజేస్తున్న అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ, న్యాయమూర్తి బుజ్జప్ప

హిందూపురంలో 115 కేసులు పరిష్కారం

హిందూపురం : ఇరువర్గాలు రాజీ కావడం వల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ తెలియజేశారు. ఇన్‌ఛార్జి లోక్ అదాలత్ మెజిస్ట్రేట్ బుజ్జప్పతో కలిసి జాతీయ మెగా లోక్ అదాలత్‌ను ఏడీజే కంపల్లె శైలజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ మార్గంతో పరిష్కరించుకోవడం వల్ల ఇరువర్గాలకు ఖర్చు, వ్యయప్రయాసాలు తగ్గుతాయిని తెలిపారు. అనంతరం రెండు బెంచ్‌లను ఏర్పాటు చేసి 115 కేసులను పరిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో ఎస్‌బిఐ రీజినల్ మేనేజర్ శశిధర్, ఎజిపి శ్రీనివాసరెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు సిద్ధు, కళావతి, సంతోషి కుమారి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్, ఏపీపీలు నగేష్, సుహాసిని, న్యాయవాదులు సత్యనారాయణ, పీవీ శ్రీనివాస్ రెడ్డి, నాగరాజు, డి. నాగరాజు, కష్ణమూర్తి, సతీష్, ఈశ్వరప్ప, లోక్ అదాలత్ సిబ్బంది శారద, హేమావతి తదితరులు పాల్గొన్నారు.



కదిరిలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి జయలక్ష్మి



సమ్మె శిబిరంలో మోకాళ్లపై కుర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

మోకాళ్లపై నిల్చొని కార్మికుల నిరసన

ప్రజాశక్తి-హిందూపురం

పెండింగ్‌లో ఉన్న 7 నెలల వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శ్రీరామిరెడ్డి నీటి సరఫరా కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం నాటికి 10వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సమ్మె శిబిరంలో కార్మికులు మోకాళ్లపై కుర్చోని నిరసన తెలిపారు. అదే విధంగా పెండింగ్ వేతనాలను మంజూరు చేయక పోతే చేసిన అప్పులు తీర్చలేక తమకు ఆత్మ హత్యలే శరణ్యం అంటు మెడకు ఊరి తాళ్లు వేసుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియూ పట్టణ నాయకులు విఆర్.రాము మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 600 మంది కార్మికులు ఏడు నెలలుగా జీతాలు లేక, కుటుంబాలు గడవక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కార్మికుల కుటుంబాలను దష్టిలో ఉంచుకుని పెండింగ్ వేతనాలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సోమశేఖర్, నాగేంద్ర, బాలు, అనిల్, రవి, జబీవుల్లా, మంజునాథ్, గిరీష్, సూర్యనారాయణ, లక్ష్మిపతి, హనుమంతు, సుబ్బరాయుడు, మల్లికార్జున, జగదీష్ పాల్గొన్నారు.

ఎన్ఎస్‌పిఆర్ కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్

ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు నేషనల్ అసెస్మెంట్, అక్రిడిటేషన్ 'ఏ' గ్రేడ్ గుర్తింపు లభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డా॥ఎం.ప్రగతి శనివారం ఆమె ఈ విషయాలను వెల్లడించారు. ఈ సంవత్సరం జూలై 10, 11వ తేదీల్లో ఒక అత్యున్నత స్థాయి బందం, ఈనెల 5,6వ తేదీల్లో ముగ్గురు సభ్యులతో కూడిన మరో బందం కళాశాలను సందర్శించి, కళాశాలలోని అన్ని విభాగాల్లో అకాడమిక్, అడ్మినిస్ట్రేటివ్, కో కరికులర్, ఎక్స్‌ట్రా కరికులర్ కార్యకలాపాలను పర్యవేక్షించి తమ నివేదిక, సిఫార్సులను బెంగుళూరులోని న్యాక్ కార్యాలయానికి పంపించారు. వారి సిఫార్సుల మేరకు కళాశాల 'ఏ' గ్రేడ్ గుర్తింపు సాధించినట్లు న్యాక్ కార్యాలయం కళాశాలకు మెయిల్ ద్వారా సమాచారం పంపిందని ప్రిన్సిపల్ తెలిపారు. 4 పాయింట్లకు గాను 3.01 సిజిపిఎ స్కోరుతో శ్రీ సత్యసాయి జిల్లాలో ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అగ్రగామిగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశులు, ఐక్యూ ఎ.సి. సమన్వయకర్త డాక్టర్ శ్రీలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు పాల్గొన్నారు.



కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి

ఐఎబి ప్రాధాన్యత తగ్గుతోందా.?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎప్పుడైనా సీజన్ ప్రారంభానికి ముందే నీటి పంపకాలపై ప్రణాళికలు రూపొందించుకుంటారు. అందుకు అనుగుణంగా ఏడాది ప్రణాళిక ఉంటుంది. అయితే ఉమ్మడి అనంతపురం జిల్లాలో మాత్రం ఎలాంటి ప్రణాళికలు లేకుండానే ముందుకు సాగుతుండటం గమనార్హం. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ముగిసే సమయం వచ్చింది. కానీ ఇప్పటి వరకు సాగునీటి సలహా మండలి సమావేశం జరగలేదు. దీంతో దిగువనున్న ఆయకట్టు రైతుల్లో అయోమయం నెలకొంది. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ కింద ఎగువ ప్రధాన కాలువ, గుంతకల్లు బ్రాంచ్ కెనాల్‌కు నీటిని విడుదల చేశారు. దిగువనున్న మిడ్‌పెన్నార్, ఉత్తర కాలువ, పిఎబిఆర్ కుడికాలువకు నీటిని విడుదల చేయలేదు. ఇది విడుదల చేయాలంటే సాగునీటి సలహా మండలి సమావేశంలో నిర్ణయం జరగాల్సి ఉంది. ఎగువనున్న కెనాల్స్‌కు సలహా మండలి సమావేశం నిర్ణయం జరగకుండానే నీటిని విడుదల చేస్తున్నారు. కాని దిగువనున్న కెనాల్స్‌కు నీటిని విడుదల తేదీలు ఖరారు కాకపోవడంతో ఈ ప్రాంత రైతుల్లో అయోమయం నెలకొంది. ఈ వారంలో ఐఎబి సమావేశం తేదీలు ఖరారు చేసి చివరి నిమిషంలో వాయిదా వేశారు. దీనిపై విపక్షాలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నాయి. వర్షాలొచ్చి పుష్కలంగా నీరున్నా ఐఎబి సమావేశం నిర్వహించకుండా వాయిదాలు వేయడాన్ని తప్పుబడుతున్నారు. త్వరలోనే ఖరారు చేసి నీటి విడుదల చేయకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు మరో తేదీని ఖరారు చేశారు. ఈనెల 19న నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. అయితే ఈతేదీలోనైనా జరుగుతుందా.. లేదా.. అన్నది చూడాల్సి ఉంది. గతంలో ఎన్నడూలేనంతగా ఈసారి తుంగభద్ర డ్యామ్‌కు, శ్రీశైలంకు నీరొచ్చాయి. దీంతో హెచ్ఎల్‌సి, హెచ్ఎన్ఎస్ఎస్‌కి నీరు పుష్కలంగా వస్తుందని ఆశించారు. కానీ నీటి నిర్వహణలో లోపాలు చోటు చేసుకున్నాయి. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ పరిస్థితి అధ్వాన్నంగా ఉండటంతో పూర్తి సామర్థ్యంతో నీటిని తీసుకోలేకపోతున్నారు. దీని ఆధునీకరణ సైతం అటకెక్కింది. ఈ వారంలోనూ కాలువపై బ్రిడ్జి పడిపోయింది. ఈ రకంగా వరుసగా ప్రతి ఏటా ఏదోక చోట బ్రిడ్జి పడిపోతూనే ఉన్నాయి. దీనికి తక్షణ మరమ్మత్తులకు రూ.30 కోట్లు అయినా ఖర్చు అవుతుందని అంచనా వేశారు. అయితే ప్రభుత్వాలు మారుతున్నా నిర్వహణపై మాత్రం దృష్టి సారించడం లేదు. కనీస మరమ్మతులకు కూడా నోచడం లేదు. ఎప్పుడు ఎక్కడ విపత్తు సంభవిస్తుందో తెలియడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ఆధునీకరణ పనులు చేపట్టాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఇక ఈవారంలో జరిగిన ప్రదానమైన అంశాల్లో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలు అనంతపురంలో అట్టహాసంగా జరుగుతున్నాయి. అట్టహాసంగా జరుగుతున్న ఈ మహాసభలకు రాష్ట్రం నలుమూలల నుంచి జన విజ్ఞాన వేదిక నాయకులు తరలొచ్చాయి.





నల్లమాడలో ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు

సీతారాం ఏచూరికి నివాళి

బుక్కపట్నం : సిపిఎం జాతీయ కార్యదర్శి, ఉద్యమ నేత సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటు అని సిపిఎం సీనియర్ నాయకులు రామకృష్ణ తెలిపారు. బుక్కపట్నంలో శనివారం సిపిఎం ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఏచూరి మరణం కార్మిక లోకానికి తీరని లోటు అన్నారు. గడ్డు పరిస్థితుల్లో సైతం పార్టీ, ప్రజల కోసం అలుపెరుగని పోరాటాలు చేశారని ఆయన సేవలను కొనియాడారు. విద్యార్థి నాయకుడిగా, రాజకీయాల్లో పార్లమెంటేరియన్‌గా ప్రత్యేకతను చాటుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బాల్ల అంజి, ముత్యాలు, సివిల్ సప్లై హమాలీ యూనియన్ దాసు, మహమ్మద్, రామాంజి, మారుతి, నాగవేణి, తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ : స్థానిక బస్టాండ్ కూడలిలో కార్మిక, కర్షక సంఘాల ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, రంగప్ప, కో కన్వీనర్ వెంకటేష్, సిపిఎం మండల కార్యదర్శి గోవిందు మాట్లాడుతూ తుది శ్వాస వరకు ప్రజల పక్షాన పోరాడి జన హృదయాల్లో నిలిచిపోయిన ఎర్రజెండా ముద్దు బిడ్డ సీతారాం ఏచూరి అన్నారు. కార్యక్రమంలో మేరీ సుజాత, కమలమ్మ, మహాలక్ష్మి, రామాంజనమ్మ, కిరణమ్మ, రమణమ్మ, అంగన్వాడీ, కార్మికులు, సిఐటియు, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గణేష్ నిమజ్జనం : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

వినాయక చవితి వేడుకల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ముగియడం పట్ల జిల్లా ఎస్పీ వి.రత్న పోలీసు అధికారులు, సిబ్బంది, అన్ని శాఖల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. బాగా పని చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందికి రివార్డులు అందజేస్తామని తెలిపారు. ఈ నెల 16న జరిగే మిలాద్ ఉన్ నబీ పండుగను కూడా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా బాగా పని చేయాలని ఎస్పీ ఆదేశించారు.

వినాయక నిమజ్జనంలో తప్పని వివాదం

హిందూపురం : రెండేళ్ల నుంచి హిందూపురంలో వినాయక నిమజ్జన సమయంలో వివాదం తప్పడం లేదు. వినాయక ఉత్సవ సమితి నిర్వాహకుల మధ్య తీవ్ర పోటీతో శుక్రవారం రాత్రి ప్రారంభమైన నిమజ్జనం ప్రక్రియ శనివారం రాత్రి వరకూ కొనసాగింది. పట్టణంలో 200కు పైగా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి, పూజలు నిర్వహించి, సజావుగా నిమజ్జనం చేస్తారు. అయితే ముక్కిడిపేట, కట్టకింద, బాపూజీనగర్, రైల్వే రోడ్డులో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను చివరిగా నిమజ్జనం చేస్తారు. తామంటే తాము చివరిగా నిమజ్జనం చేస్తామని వీరు వాదనలకు దిగారు. చివరకు పోలీసు అధికారులు నిర్వాహకులతో చర్చించి ఒప్పించడంతో శనివారం సాయంత్రం ముందుగా ముక్కిడిపేట విగ్రహం, ఆ తర్వాత బాపూజీనగర్, కట్ట కింద విగ్రహం, చివరగా రైల్వే రోడ్డులో ఏర్పాటు చేసిన గరడి వినాయకుని విగ్రహాలను నిమజ్జనం చేశారు.



నిమజ్జనానికి తరలుతున్న వినాయక ప్రతిమలు

పిహెచ్‌సిల్లో ఓపీ సేవలు బంద్

చిలమత్తూరు : మండలంలోని చిలమత్తూరు, కోడూరు పిహెచ్‌సిల్లో శనివారం ప్రభుత్వ వైద్యులు పూర్తిగా ఓపీ సేవలు బంద్ చేశారు. అత్యవసర సేవలు మినహా ఎలాంటి కార్యకలాపాలు జరపలేదు. జీఓ-85ను రద్దు చేయాలని కోరుతూ మూడు రోజులుగా పిహెచ్‌సి వైద్యులు ఆందోళనలకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఎలాంటి అనుకూల ప్రకటన చేయకపోవడంతో శనివారం ఓపీ సేవలు బంద్ చేసినట్లు ఏపి పిహెచ్‌సి డిఏ స్టేట్ ప్యానెల్ మెంబరు, జిల్లా అధ్యక్షుడు డా. పి.రామకృష్ణ తెలిపారు. సోమవారం నుంచి విజయవాడలో తమ ఆందోళనలు ఉధృతం చేస్తామని తెలిపారు. ఇప్పటికే అన్ని పిహెచ్‌సిల వద్ద నోటీసు అతికించినట్లు తెలిపారు. ప్రభుత్వం పిహెచ్‌సి వైద్యులకు అన్యాయం జరిగేలా జీఓ-85 తేవడం దారుణమన్నారు. న్యాయం జరిగే వరకూ ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. కాగా ఓపీ సేవలు బంద్ కావడంతో పేద ప్రజలు వైద్యం కోసం వచ్చి వెనుదిరిగారు. డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో ప్రయివేటు ఆసుపత్రులు, ఆర్ఎంపీల వద్దకు వెళ్లి చికిత్స పొందారు.



విజయవాడ వరద బాధితుల కోసం విరాళం అందజేస్తున్న ఈశ్వరమ్మ

వరద బాధితుల కోసం రూ. 50వేల విరాళం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

మున్సిపాలిటీ పరిధిలోని కర్ణాటక నాగేపల్లి గ్రామానికి చెందిన పెద్దన్నగారి ఈశ్వరమ్మ రూ. 50వేలు విరాళం అందజేశారు. ఆ చెక్కును శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డికి అందజేశారు. పల్లె మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజల నుంచి విరాళాలు సేకరిస్తున్నామని, త్వరలోనే 1000 క్వింటాళ్ల బియ్యం, సరుకులు, దుస్తులు, నగదు చెక్కులను సిఎం సహాయ నిధికి అందజేస్తామన్నారు. ఈశ్వరమ్మ మాట్లాడుతూ టీవీల్లో వరద బాధితుల కష్టాలను చూసి చలించిపోయానని, పోగు చేసిన డబ్బును ఇచ్చానని తెలిపారు.

పుట్టపర్తి క్రైమ్ : విజయవాడ వరద బాధితుల సహాయార్థం టిడిపి పట్టణ కన్వీనర్ రామాంజ నేయులు ఆధ్వర్యంలో కర్ణాటక నాగేపల్లిలో విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ, దుకాణాల వద్దకు వెళ్లి బియ్యం, దుస్తులు, నగదు సేకరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పుడా మాజీ ఛైర్మన్ కడియాల సుధాకర్, గూడూరు ఓబులేష్, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, నాయకులు శ్రీరాములు, మాజీ కౌన్సిలర్ రాజప్ప, స్టోర్ డీలర్ రాము, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ : విజయవాడ వరద బాధితుల కోసం మండలంలోని చౌటకుంటపల్లి గ్రామానికి చెందిన మాజీ డీలర్ పద్మనాభరెడ్డి ఆధ్వర్యంలో 35 ప్యాకెట్ల బియ్యం సేకరించారు. కార్యక్రమంలో నాగురి సుధాకర్‌రెడ్డి, నాగభూషణ రెడ్డి, షామిల్, మనోహర్, సుధాకర్, ఆంజనేయులు, శ్రీరాములు, రమణప్ప తదితరులు పాల్గొన్నారు. సోమగుట్టపల్లి, దొన్నికోట గ్రామాల్లో డాక్టర్ బుట్టి నాగభూషణ్ నాయుడు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు బియ్యం, నిత్యావసరాలు, విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో ఎం.నర్సింహులు, కేశవరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, ప్రతాపరెడ్డి, మహేందర్‌నాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సెబ్, ఎక్సైజ్ శాఖల విలీనంపై హర్షం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, ఎక్సైజ్ శాఖలను విలీనం చేసినందుకు ఏపి ప్రభుత్వానికి పుట్టపర్తి ఎక్సైజ్ శాఖ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. వారు శనివారం సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. గతంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ వేర్వేరుగా విధులు నిర్వర్తించేవారు. ప్రస్తుతం ఆ రెండు శాఖల విలీనంతో సిబ్బంది మొత్తం ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ పరిధిలోకి రావడంతో సిబ్బంది ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పుట్టపర్తి ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల విద్యతోనే సమాజాభివృద్ధి

మంత్రి సవిత, మాజీ మంత్రి పల్లె

ప్రజాశక్తి-బుక్కపట్నం

బాలికల విద్యతోనే సమాజం అభివృద్ధి సాధ్యమవుతుందని బిసి సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి తెలిపారు. వారు శనివారం స్థానిక ఎంజెపి స్కూల్‌ను సందర్శించి రికార్డులు, వంటగది, తరగతి గదులను తనిఖీ చేశారు. విద్యార్థులతో ముచ్చటించారు. వారు మాట్లాడుతూ పిల్లల అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకొని ఎన్టీఆర్ హయాంలోనే బిసి వెల్ఫేర్ హాస్టల్ స్కూల్స్‌ను ప్రారంభించారన్నారు. చంద్రబాబు 105 బిసి స్కూల్స్ ప్రవేశపెట్టగా, గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం కేవలం రెండు స్కూల్స్ ఏర్పాటు చేసిందని విమర్శించారు. టిడిపి ప్రభుత్వంలో బడుగు బలహీన వర్గాల పిల్లల అభ్యున్నతి కోసం, బిసి వెల్ఫేర్ స్కూల్స్‌ను ప్రవేశపెట్టి కార్పొరేట్‌కు దీటుగా విద్యనందించిందని తెలిపారు. ఒక్క ఛాన్స్ అని అన్ని రంగాలను నిర్వీర్యం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. టిడిపి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడకుండా అభివృద్ధి పథంలో నడుస్తుందని తెలిపారు. బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని తెలిపారు. స్కూల్‌లో మౌలిక వసతుల కోసం పల్లె రఘునాథరెడ్డి తక్షణ సాయంగా రూ. 50 వేలు అందజేశారు. వారి వెంట బిసి వెల్ఫేర్ అధికారి రాజేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ రమాదేవి, టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



హాస్టల్‌ను పరిశీలిస్తున్న మంత్రి సవిత, మాజీ మంత్రి పల్లె

మడకశిరలో పరిశ్రమల ఏర్పాటుకు సహకరించండి

కేంద్ర మంత్రి కుమారస్వామికి ఎమ్మెల్యే రాజు వినతి

ప్రజాశక్తి-మడకశిర

కర్నాటక రాజధాని బెంగళూరులోని జెడిఎస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డి.కుమారస్వామిని కలిశారు. ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ మండలంలోని ఆర్.అనంతపురం వద్ద ఎపిఐఐసి ఆధీనంలో ఉన్న 1600 ఎకరాల పారిశ్రామికవాడలో, అగళి మండలంలోని గాయత్రీ కాలనీ వద్ద అందుబాటులో ఉన్న 3వేల ఎకరాల ప్రభుత్వ భూమిలో భారీ పరిశ్రమలు నెలకొల్పి మడకశిర నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు. పరిశ్రమల ఏర్పాటు వల్ల స్థానిక నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగావకాశాలు ఏర్పడి వలసలు తగ్గుతాయని వివరించారు. అలాగే కుంచిటి వక్కలిగ, వీరశైవ లింగాయత్, సాదర కులస్తులను ఓబిసి జాబితాలో చేర్చాలని, వాల్మీకి కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు తోడ్పాటు అందించాలని కోరారు. వీటిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ వీలైనంత త్వరలో మడకశిర ప్రాంతంలో భారీ పరిశ్రమలు స్థాపించేందుకు చర్యలు తీసుకుంటామని ఖచ్చితమైన హామీని ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. సమావేశం ఎమ్మెల్యే రాజు మాజీ ప్రధాని దేవేగౌడని కలిసి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో కర్నాటక ఎమ్మెల్యే సిబి సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, ఉగ్రేష్‌గౌడ, తుమకూరు జిల్లా జెడిఎస్ అధ్యక్షులు అంజనప్ప, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, కుంచిటి వక్కలిగ రాష్ట్ర కన్వీనర్ విఎం.పాండురంగప్ప, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, గణేష్, సీనియర్ పాత్రికేయులు హెచ్.గోవిందప్ప, మాజీ ఎంపిపి మీనాక్షి రామారెడ్డి, కెపి.రాజన్న, రమేష్, ఆర్.తిమ్మప్ప, శ్రీరంగప్ప, తిమ్మప్ప, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



కేంద్రమంత్రికి వినతి పత్రం సమర్పించిన ఒక్కలిక సంఘం నాయకులు

ప్రభుత్వ లాంఛనాలతో ఏఆర్ కానిస్టేబుల్ అంత్యక్రియలు

ప్రజాశక్తి-ముదిగుబ్బ/పుట్టపర్తి రూరల్

ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో విధుల్లో ఉన్న ఏఆర్ కానిస్టేబుల్ చంద్ర నాయక్ శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని శనివారం గరుగుతండాకు తీసుకురాగా ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఇతను 2003లో ఏపీఎస్పీ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. ఆ తర్వాత ఏఆర్ కానిస్టేబుల్‌గా చేరారు. అతడికి భార్య అరుణ, కూతుళ్లు అంజలి, నందిని ఉన్నారు. స్వగ్రామంలో జరిగిన అంత్యక్రియల కార్యక్రమంలో ముదిగుబ్బ సిఐ శ్యామరావు, పట్నం ఎస్ఐ నరసింహులు, పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్యకుమార్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, గాండ్ల హరినాథ్, లక్ష్మీనారాయణ, ఆనంద్ సిబ్బంది, బ్యాచిమేట్లు, బంధువులు, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు అనంతపురంలో చంద్రనాయక్ మృతదేహానికి అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల ఖర్చుల కోసం రూ. 25 వేలు అందజేశారు. ఇదిలా ఉండగా కానిస్టేబుల్ చంద్రనాయక్ కుమార్తె గుజరాత్‌లో చదువుతోంది. తండ్రి మరణం గురించి తెలియడంతో ఆమె ఇక్కడికి రావడానికి ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న హిందూపురం పార్లమెంటరీ టిడిపి సోషల్ మీడియా కోఆర్డినేటర్ హేమలతాబాయి ఈ విషయాన్ని మంత్రుల దృష్టికి తీసుకెళ్లి విమానంలో వచ్చేలా ఏర్పాటు చేయించారు.



ఏఆర్ కానిస్టేబుల్ చంద్రనాయక్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ జగదీష్



ఎంపి బికె పార్థసారథిని సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

ఎంపి బికె.పార్థసారథికి సన్మానం

పెనుకొండ టౌన్ : పట్టణంలోని ఎంపి కార్యాలయంలో శనివారం పెనుకొండ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు సుధాకర్ గుప్తా ఆధ్వర్యంలో సంఘం సభ్యులు ఎంపి బికె.పార్థసారథిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం నాయకులు రాజన్న, శ్రీరాములు, మోహన్‌కృష్ణ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం హిందీ దివస్ కార్యనిర్వాహక కమిటీ కన్వీనర్ జాబిలి జయచంద్ర హిందీ దివస్ కార్యక్రమానికి ఎంపి బికె.పార్థసారథిని ఆహ్వానించారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

పుట్టపర్తి రూరల్ : గ్రీన్ భారత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని అమగొండపాలెం అటవీ ప్రాంతంలో రోడ్డుకిరువైపులా మొక్కలు నాటారు. సిఎం చంద్రబాబు ఆశయాలను నెరవేర్చడమే గ్రీన్ భారత్ ముఖ్య ఉద్దేశమని, జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంగా చేపడుతున్నామని తెలిపారు. ఎపిని హరితాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు 35 ఏళ్లుగా సంస్థ ఎన్నో లక్షల మొక్కలు నాటిందన్నారు. మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించడం ఉద్యమంలా చేపట్టామని, ఇప్పటికే 15 లక్షల మొక్కలు నాటామని, అవి ఇప్పుడు మహా వృక్షాలు అయ్యాయని వాటి ద్వారా సమస్త జీవరాశులకు ప్రాణవాయువు అందించడమే కాక ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. అమగొండ పాలెంలో గ్రామస్తులతో కలిసి పర్యావరణవేత్త డాక్టర్ శంకర్‌నారాయణ మొక్కలు నాటారు. సంస్థ ఆధ్వర్యంలో మొక్కల సంరక్షణ కూడా చేపడతామని తెలిపారు.



మొక్క నాటుతున్న డాక్టర్ శంకర్‌నారాయణ

పర్యావరణ సేవకుడికి భారత సేవా రత్న అవార్డు

ముదిగుబ్బ : మండలంలోని గుంజేపల్లి గ్రామానికి చెందిన గుట్ట గోపాల్ 14 ఏళ్లుగా సామాజిక సేవా దృక్పథంతో సేవలందిస్తున్నారు. గుట్ట గోపాల్‌ను గుర్తించి బెంగళూర్‌లోని జక్కూరులో సోమల రాజు ఫౌండేషన్ సంస్థ భారత సేవా రత్న అవార్డు ప్రదానం చేశారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సముదాయ భవనంలో శనివారం జరిగిన సంస్థ 12వ వార్షికోత్సవం సందర్భంగా గోపాల్‌కు భారత సేవా రత్న నేషనల్ బెస్ట్ సర్వీస్ అవార్డ్-2024ను గోపాల్‌కు అందజేశారు.



గుట్ట గోపాల్‌ను అవార్డుతో సత్కరిస్తున్న నిర్వాహకులు

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

లేపాక్షి : మండలంలోని కల్లూరు పంచాయతీలో 15వ ఆర్థిక సంఘంకు సంబంధించిన నిధులను పంచాయతీ కార్యదర్శి ప్రమేయం లేకుండా సర్పంచి నిధులను సుమారు రూ. 3 లక్షలు దుర్వినియోగం చేశారని దీనిపై విచారణ చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి లక్ష్మయ్య శనివారం ఎంపిడిఒకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై పూర్తి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని ఈఓఆర్‌డి శివన్న తెలిపారు.

తాళికెరలో పారిశుధ్యం పనులు

గుడిబండ : మండలంలోని తాళికెర గ్రామంలో సర్పంచి రంగస్వామి, పంచాయతీ కార్యదర్శి గోవిందప్ప పర్యవేక్షణలో శనివారం పారిశుధ్యం పనులు ముమ్మురంగా చేపట్టారు. గ్రామాల్లో ప్రస్తుతం సీజన్ వ్యాధులు ప్రబలుతుండడంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చెత్త చెదారం, ముళ్లపొదలు తొలగించారు.

'కార్మికులకు నష్టం కలిగించే చర్యలను వ్యతిరేకిస్తున్నాం'

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

శ్రీసత్యసాయి తాగునీటి సరఫరా కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకూ నిరసన దీక్షలు కొనసాగిస్తామని, కార్మికులకు నష్టం కలిగించే చర్యలను వ్యతిరేకిస్తున్నామని తాగునీటి సరఫరా కార్మికుల యూనియన్ నాయకుడు మధు స్పష్టం చేశారు. పట్టణంలోని పంప్ హౌస్ వద్ద చేపట్టిన నిరసన దీక్షలు పదో రోజుకు చేరుకున్నాయి. శిబిరంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఈ పథకాన్ని ప్రభుత్వం 19 విభాగాలుగా విభజించే ప్రయత్నం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. విభజించడం వల్ల అటు ప్రజలు, ఇటు కార్మికులకు నష్టం వాటిల్లుతుందన్నారు. బకాయి వేతనాలు ఇంతవరకూ కార్మి కుల ఖాతాలో జమ కాలేదన్నారు. ఏడు నెలల వేతనాలతో పాటు పిఎఫ్ జమ చేయాలని, ఈఎస్ఐ, గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ పథకాన్ని గతంలో మాదిరిగానే కొనసాగించాలని మంత్రి సవితమ్మ, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్‌కు వినతి పత్రాలు సమర్పించామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రమేష్, ప్రభు, హరి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సవిత, పల్లెకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు


'స్వచ్ఛత హి సేవ' ర్యాలీ

తలుపుల : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛత హి సేవ-2024 కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి మెయిన్ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. ప్రజలకు స్వచ్ఛత, దానివల్ల లాభాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ, ఈఓఆర్‌డి, మండల స్థాయి అధికారులు, తలుపుల మేజర్ పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు, అంగన్వాడీ వర్కర్స్, ఎఎన్ఎం, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిగి : మండల వ్యాప్తంగా ఈ నెల 13 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకూ నిర్వహించే స్వచ్ఛత హి సేవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంపిడిఒ సరస్వతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ, డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

సిఐను కలిసిన సిపిఎం నాయకులు

ముదిగుబ్బ : స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం సిఐ శ్యామ్‌రావును సిపిఎం, సిఐటియు, ఆవాజ్ కమిటీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పూలపూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. అలాగే సిఐతో శాంతి భద్రతలపై చర్చించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సిఐటియు మండల కార్యదర్శి బండల వెంకటేష్, పోతులయ్య, బాబు, మునాఫ్, చాంద్‌బాషా, శివకుమార్, వెంగముని, ఆవాజ్ కమిటీ కార్యదర్శి బాబ్‌జాన్, చికెన్ రఫీ, టైలర్ ముత్తు, మహబూబ్‌బాషా, బక్షు, పాల్గొన్నారు



సిఐ శ్యామ్‌రావుని సన్మానిస్తున్న సిపిఎం నాయకులు

నేరాలు ఘోరాలు

బైక్‌ను ఢీకొన్న ట్రాక్టర్.. ఒకరు మృతి

చెన్నేకొత్తపల్లి : ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం చెన్నేకొత్తపల్లి సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. అనంతపురం నగరంలోని గుల్జార్‌పేటకు చెందిన తుమ్ములకుంట షేక్ మతిన్(48) వెల్డింగ్ పని చేస్తూ జీవనం సాగించేవాడు. సొంత పని నిమిత్తం తన వద్ద పని చేసే మహమ్మద్ గౌస్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై లేపాక్షికి బయల్దేరారు. జాతీయ రహదారి-44పై వెళ్తుండగా మార్గమధ్యలో చెన్నేకొత్తపల్లి సమీపంలోని హెచ్ఎల్‌సి కెనాల్ దాటిన తరువాత ఎదురుగా రాంగ్ రూట్‌లో వచ్చిన ట్రాక్టర్ వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిద్దరినీ ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా బైక్ నడుపు తున్న మతిన్ మృతి చెందాడు. మహమ్మద్‌గౌస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. డ్రైవర్ అతివేగం, అజాగ్రత్తగా ట్రాక్టర్‌ను నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి...

పరిగి : మండలంలోని జంగాలపల్లి వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. అతడు జంగాలపల్లి రోడ్డు మార్గంలో హైవేపై వెళ్తుండగా వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అతడి వయసు 60 ఏళ్లు ఉంటుందని, ఆ వ్యక్తి ఆచూకీ తెలిస్తే 9440901879 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్ఐ రంగడు తెలిపారు.

కారు ఢీకొని ఆర్మీ మాజీ జవాన్...

హిందూపురం : రూరల్ మండలంలోని బీరేపల్లి సమీపంలో ఉన్న కిమెల్ పరిశ్రమ గేట్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్మీ మాజీ జవాన్ అచ్చప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. హిందూపురం నుంచి గోరంట్ల వైపు వెళ్తున్న కారు, గోరంట్ల నుంచి ద్విచక్ర వాహనంపై హిందూపురం వస్తున్న అచ్చప్పను ఢీకొంది. ఈ ప్రమాదంలో అచ్చప్ప అక్కడికక్కడే మతి చెందారు.

పోలీసుల అదుపులో నిందితులు

కొత్తచెరువు : కొత్త చెరువులో రెండు రోజుల క్రితం బేల్దారి గంగాధర్ హత్యకు గురయ్యాడు. ఇతడు మద్యానికి బానిసై స్థానికంగా ఓ హోటల్‌లో పని చేసే మహిళను లైంగిక వేధింపులకు గురి చేసేవాడు. ఆ వేధింపులకు తాళలేని ఆ మహిళ గంగాధర్‌ను ఎలాగైనా హతమార్చాలని నిర్ణయించు కుంది. బంధువులతో కలిసి గత బుధవారం రాత్రి స్థానిక తహశీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న ఇటుకల బట్టీ వద్ద బండరాళ్లతో దాడి చేసి హత్య చేసినట్లు సమాచారం. సదరు మహిళను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు, మిగిలిన వారు పరారీలో ఉన్నట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఓబుళదేవరచెరువు : మండలంలోని వేమారెడ్డిపల్లి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎం.నరసింహులు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని జరికుంటపల్లి గ్రామానికి చెందిన నరసింహులు ద్విచక్రవాహనంపై మహ్మదాబాద్ క్రాస్ నుంచి స్వగ్రామం వెళ్తుండగా కదిరి వైపు నుంచి బెంగళూరు వైపు వెళ్తున్న వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో నరసింహులు తీవ్రంగా గాయపడడంతో స్థానికులు పోలీసుల సహకారంతో ప్రయివేట్ వాహనంలో కదిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

పుట్టపర్తి క్రైమ్ : పట్టణంలోని 'ఖిద్మత్ ఏ ఖల్క్' స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శనివారం ఓ అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ చిత్తూరు జిల్లాకు చెందిన సత్యసాయి భక్తుడు భవాని కొన్నేళ్ల క్రితం పుట్టపర్తికి వచ్చి స్థానిక గోపురం వీధిలో స్థిరపడ్డాడు. శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలియడంతో ప్రత్యేక వైకుంఠ రథంలో మృతదేహాన్ని శ్మశానవాటికకు తీసుకెళ్లి దహన సంస్కారాలు పూర్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శామీర్, అలీ, చాంద్, సాయిప్రసాద్, సాయి మాతాంగి, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

బాలసదన్‌కు చిన్నారుల తరలింపు

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

పట్టణంలోని రైల్వే ట్రాక్ దగ్గర భిక్షాటన చేస్తున్న నలుగురు ఆడపిల్లలు, ఒక మగ పిల్లాడిని శనివారం సిడిపిఒ డాక్టర్ శాంతలక్ష్మి హిందూపురం పట్టణంలోని బాలసదన్‌లో చేర్పించారు. వెంకటేష్ కుటుంబం లో ఐదుగురు పిల్లలు ఉండడంతో వారు పోషించలేకపోయారు. దీంతో పిల్లలు భిక్షాటన చేస్తూ జీవనం గడిపేవారు. వీరికి కనీసం ఇల్లు కూడా లేదు. ఈ విషయం తెలియడంతో సిడిపిఒ చొరవ తీసుకుని ఆ కుటుంబ సభ్యులను ఒప్పించి బాలల సంరక్షణ సమితి దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు ఆ పిల్లలను హిందూపురంలోని బాలసదన్‌లో చేర్పించారు. వారి పిల్లల భవిష్యత్తుకు మంచి పునాది పడుతున్నం దుకు తల్లిదండ్రులు సైతం సంతోషం వ్యక్తం చేశారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎర్రమ్మ, అంగన్వాడీ టీచర్స్ చంద్రకళ, కృష్ణవేణి, డిసిపిఒ మహేష్, ఐసిపిఎస్ నాగలక్ష్మి, సిడబ్ల్యుసి ఛైర్ పర్సన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE::PENUKONDA
E.P. No:22/2022 in O.S No.2/2021

Between:
Rizwan Ali Khan ...**Petitioner/D.Hr**
And
L.Priyanka Naik ...**Respondent/J.Dr**

జప్తు నోటీసు

To,
యల్.ప్రియాంక నాయక్ W/o యల్.రాజేంద్ర కుమార్, వయస్సు 32 సం॥లు, హౌస్ వైఫ్, డోర్ నెం:6-4-283, మారుతి నగర్, అనంతపురం.

ఇందుమూలముగా తెలియజేయడం ఏమనగా పై కోర్టులో పై కేసులో 18-09-2024వ తేదిన ఇ.పి షెడ్యూలు ఆస్తి జప్తి నోటీసుకు గాను మీకు వాయిదా వున్నది. కావున పై కోర్టులో పై కేసులో 18-09-2024వ తేదిన ఉదయం 10:30 గంటలకు మీరు ఖుద్దున గాని లేక వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవచ్చును. లేని యెడల పై కేసులో మీ పరోక్షముగా తీర్మానించబడును.

షెడ్యూలు

అనంతపురం జిల్లా హిందూపురం రి॥డి పెనుకొండ సబ్॥డి కి చేరిన సోమందేపల్లి మండలం, సోమందేపల్లి గ్రామం పొలంలో నందు సదరి పంచాయితీ ఏరియాలో 6వ వార్డు సాయి నగర్ వద్ద నలగొండ్రాయినిపల్లి గ్రామము సమీపమున విభాగాల మేరకు నా భాగానికి రాబడి నా స్వాధీన హక్కు అనుభవం గల ఆస్తి వివరము సహి

బాబు	సర్వే నెం.	విస్తీర్ణం
స.కుప్పి	34-1	ఎ.00.19 సెంట్లు యిందు పెకి

1వ అయిటం తూర్పు: ఉత్తర దిశలో 62 అడుగులు లేక 18.91 మీటర్లు, దక్షిణ దిశలో 63 అడుగులు లేక 19.21 మీటర్లు, ఉ:ద: తూర్పు దిశలో 72 అడుగులు లేక 21.96 మీటర్లు పడమర దిశలో 75 అడుగులు లేక 22.87 మీటర్లు గా గల బయలుకు చెక్కుబంది తూ:3.5 అడుగుల వెడల్పు గల రోడ్డు, ప: 10 అడుగుల వెడల్పు గల రోడ్డు, ఉ:గోపమ్మ బయలు జాగా, ద:క్రిష్ణప్ప, నారాయణ జామీన్లు ఈ మధ్య గల 510 చదరపు గజాలు బయలు పూరా.

బాబు	సర్వే నెం.	విస్తీర్ణం
స.కుప్పి	34-1	ఎ.00.19 సెంట్లు యిందు పెకి

2వ అయిటం తూర్పు: ఉత్తర దిశలో 31.5 అడుగులు లేక 9.61 మీటర్లు, దక్షిణ దిశలో 32 అడుగులు లేక 9.76 మీటర్లు, ఉ:ద: తూర్పు దిశలో 75.5 అడుగులు లేక 23.03 మీటర్లు పడమర దిశలో 76 అడుగులు లేక 23.18 మీటర్లు గా గల బయలుకు చెక్కుబంది తూ:10 అడుగుల వెడల్పు గల రోడ్డు, ప: గాండ్ల రసూల్ బయలు జాగా, ఉ:గోపమ్మ బయలు జాగా, ద:క్రిష్ణప్ప, నారాయణ జామీన్లు ఈ మధ్య గల 267 చదరపు గజాలు బయలు పూరా.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
బి.అబూబాకర్, బి.యస్.సి.,బి.యల్.,
బి.మహమ్మద్ షానవాజ్, బి.ఏ.,యల్.యల్.బి,
అడ్వకేట్స్, పెనుకొండ-515110.
శ్రీ సత్యసాయి జిల్లా. సెల్:9989453939.